క్లుప్తంగా

సంబరంగా ముందస్తు దసరా ఉత్సవాలు



పిడుగురాళ్ల: పట్టణంలోని స్కాలర్స్ పాఠశాలలో దసరా ఉత్సవాలను సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముందుగా పాఠశాల డైరెక్టర్ జి.శ్రీనివాస్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన నిర్వహించి బతుకమ్మల ఉత్సవాలను పాఠశాలల్లో ప్రారంభించారు. రకరకాల బంతి పూలతో ఐదు అడుగుల ఎత్తు గల బతుకమ్మను ఏర్పాటు చేశారు. బతుకమ్మ ఉత్సవాల సందర్భంగా విద్యార్థులు పాఠశాలలో పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పరిష్కార వేదికకు నాలుగు అర్జీలు

మాచర్ల రూరల్: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నాలుగు అర్జీలు అందినట్లు తహసీల్దార్ బి.కిరణ్ కుమార్ సోమవారం తెలిపారు. పూర్వం నుంచి సాగు చేసుకుంటున్న మూడు ఎకరాల భూమికి డీకే పట్టా అందించాలని విజయపురిసౌత్‌కు చెందిన ఆరుమళ్ల ఏలీశమ్మ, కొత్తపల్లి గ్రామంలో రోడ్డుపై నిల్వ ఉన్న నీరు తొలగించాలని శ్రీనివాసరెడ్డి, పట్టణంలో ఖాళీ స్థలాల్లో వ్యర్థాలను తీసివేయాలని పాండురంగారావులు వినతి పత్రం అందించారు. వీటిని ఆయా శాఖలకు సంబంధించి అధికారులకు పంపి పరిష్కరించనున్నట్లు తహసీల్దార్ చెప్పారు.

రెంటచింతల ఎంపీడీఓ స్వరూపరాణి బాధ్యతల స్వీకారం



రెంటచింతల: రెంటచింతల మండల అభివృద్ధి అధికారి(ఎంపీడీఓ)గా ఎస్.స్వరూపరాణి సోమవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. నాదెండ్ల మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఏఓ, ఎఫ్ఏసీ ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తున్న స్వరూపరాణిని పదోన్నతిపై రెంటచింతల ఎంపీడీఓగా బదిలీ చేస్తూ పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ కృష్ణతేజ ఆదేశాల మేరకు సీఈఓ వి.జ్యోతిబసు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఇక్కడ ఎఫ్ఏసీ ఎంపీడీఓగా బాధ్యతలు నిర్వహిస్తున్న చినుకూరి శ్రీనివాసరావు పదోన్నతిపై నాదెండ్ల ఎంపీడీఓగా బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ స్వరూపరాణి మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్థానిక అధికారులు, ప్రజా ప్రతినిధుల సహకారంతో మండలాభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

దాచేపల్లి ఎంపీడీఓగా వెంకటేశ్వరరావు


దాచేపల్లి: మండల పరిషత్తు అభివృద్ధి అధికారిగా వుల్లంగుల వెంకటేశ్వరరావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఇన్‌చార్జి ఎంపీడీఓగా వ్యవహరించిన వీరయ్య వెంకటేశ్వరరావుకు బాధ్యతలను అప్పగించారు. ఎంపీడీఓ వెంకటేశ్వరరావును కార్యాలయం సిబ్బంది అభినందించి సన్మానించారు.

దాచేపల్లి పీఎస్‌లో సౌరశక్తి బ్యాటరీ వ్యవస్థ ప్రారంభం




దాచేపల్లి: స్థానిక పోలీస్ స్టేషన్లో సౌరశక్తి ఆధారిత బ్యాటరీ సిస్టంను సోమవారం ప్రారంభించారు. దాచేపల్లి పోలీస్‌స్టేషన్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన 4 యూనిట్ల సామర్థ్యం కలిగిన సౌరశక్తి ఆధారిత బ్యాటరీ వ్యవస్థని గురజాల డీఎస్పీ జగదీష్ ప్రత్యేకంగా పూజలు చేసి ప్రారంభించారు. పోలీస్ స్టేషన్‌లో నూతనంగా నిర్మించిన కంప్యూటర్ రూమ్‌ను పరిశీలించారు. స్టేషన్‌లో సౌర శక్తి అధికారిత బ్యాటరీ సిస్టం ఏర్పాటు చేయడం సంతోషదాయకమని డీఎస్పీ తెలిపారు. సీఐ పి.భాస్కర్, ఎస్ఐలు పాపారావు, సౌందర్ రాజన్, తిరుపతిరావుతో పాటు పోలీస్‌స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

పర్వాతారోహణ శిబిరానికి ఎంపికైన క్యాడెట్లు



లక్ష్మీనారాయణ



వెంకటసాయిరెడ్డి

నరసరావుపేట రూరల్: రాష్ట్రస్థాయి పర్వతారోహణ శిబిరానికి లింగంగుంట్ల శంకరభారతీపురం జెడ్పీ హైస్కూల్ ఎన్‌సీసీ క్యాడెట్లు ఎంపికైనట్టు పాఠశాల ఎన్‌సీసీ ఆఫీసర్ షేక్ ఫాతిమా సోమవారం తెలిపారు. పాఠశాలకు చెందిన మల్లా లక్ష్మీనారాయణ, ఎం.వెంకటసాయిరెడ్డిలు అరకు వ్యాలీలో ఈనెల 24వతేదీ నుంచి జరిగే శిబిరంలో పాల్గొంటారని పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయి ఎన్‌సీసీ శిబిరానికి ఎంపికైన క్యాడెట్స్‌ను పాఠశాల హెచ్‌ఎం ఎం.పార్వతి, ఉపాధ్యాయులు అభినందించారు.



పాత మాచర్లలో శ్రీ బాలా త్రిపుర సుందరీ దేవిగా..



రెంటచింతలలో బాల త్రిపుర సుందరీగా వాసవి అమ్మవారు



పిడుగురాళ్ల కనకదుర్గ దేవాలయంలో బాలా త్రిపురసుందరీగా..



పిడుగురాళ్ల వేంకటేశ్వరస్వామి దేవాలయంలో మత్స్య అవతారంలో..

బాలా త్రిపుర సుందరీ.. నమోస్తుతే!



పిడుగురాళ్ల పట్టణంలో మహాలక్ష్మి అమ్మవారికి సామూహిక కుంకుమ పూజ

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. తొలిరోజు అమ్మవారు బాలా త్రిపుర సుందరీగా భక్తులకు దర్శనమిచ్చారు. దసరా పండుగ నేపథ్యంలో అమ్మవారి దేవాలయాలను అందంగా అలంకరణ చేశారు. పలుచోట్ల అమ్మవారి విగ్రహాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పందిళ్లల్లో అలంకరణ చేశారు.

– రెంటచింతల/మాచర్ల/మాచర్ల రూరల్/వెల్దుర్తి/పిడుగురాళ్ల/దాచేపల్లి



గుండ్లపాడులో బాల త్రిపుర సుందరీదేవిగా..



మాచర్ల రూరల్ కొత్తపల్లిలో బాలా త్రిపుర సుందరీదేవికి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు



దాచేపల్లి అంకమ్మ తల్లి ఆలయంలో భక్తుల హోమాలు

కార్మిక చట్టాలను పునరుద్ధరించాలి



మార్కెట్ యార్డ్ ఎదుట ఆందోళన నిర్వహిస్తున్న నాయకులు

నరసరావుపేట ఈస్ట్: కార్మిక లోకానికి తీవ్ర నష్టాన్ని కలిగించే లేబర్‌కోడ్‌లను వెంటనే ఉపసంహరించుకోవాలని వామపక్ష కార్మిక సంఘాలు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. పార్లమెంట్‌లో 2020 సెప్టెంబర్ 22వ తేదీన లేబర్‌కోడ్‌లను ఆమోదించిన రోజును పురస్కరించుకుని కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సోమవారం వ్యవసాయ మార్కెట్ యార్డు ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు కార్మిక నాయకులు మాట్లాడుతూ, పార్లమెంట్‌లో ప్రతిపక్ష పార్టీల సభ్యులు వాకౌట్‌లో ఉండగా, కేంద్ర బీజేపీ ప్రభుత్వం హడావుడిగా లేబర్ కోడ్‌లను ఆమోదించటం అప్రజాస్వామికమని ఆందోళన వ్యక్తం చేశారు. ఎందరో కార్మికుల ప్రాణాలను త్యాగం చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేసి లేబర్ కోడ్‌లను ప్రవేశపెట్టడం దారుణమన్నారు. కేంద్రంలో కూటమి ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు దేశ సంపదను దోచిపెడుతూ, పేద మధ్యతరగతి ప్రజలను మభ్యపెడుతున్నారని విమర్శించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం బుద్ధి తెచ్చుకొని కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని హితవు పలికారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు ఉప్పలపాటి రంగయ్య, షేక్.జాన్‌చిన సైదా, నాగేశ్వరరావు, సీఐటీయూ నాయకులు ఆంజనేయ నాయక్, పీడీఎం నాయకులు నల్లపాటి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ ఆత్మహత్య



చిలకలూరిపేటటౌన్: అనుమానస్పద స్థితిలో ఆటో డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్న సంఘటన చినపసుమర్రు గ్రామ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని భావన ఋషినగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ వింజమూరి ఆదినారాయణ సోమవారం సాయంత్రం జాతీయ రహదారి గొర్రెలమండి సమీపంలోని పొలాల్లో ఓ వేపచెట్టుకు ఉరి వేసుకున్నాడు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి వివరాలను సేకరించారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు చిలకలూరిపేట రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే ఆర్థిక ఇబ్బందుల కారణంగానే ఆత్మహత్యకు ఆదినారాయణ బలవన్మరణం చేసుకున్నట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. మృతునికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతదేహాన్ని ఇంటికి తీసుకురావడంతో భావన ఋషినగర్‌లో విషాద ఛాయలు అలుముకున్నాయి.

'సాగర్‌బాబు' సమస్యను పట్టించుకోండి

నరసరావుపేట: సాగర్‌బాబు వికలాంగుడిగా మారటానికి కారణమైన కారంపూడి మండలం పెద కోదమగుండ్ల విద్యుత్ లైనెమెన్, అసిస్టెంట్ లెన్‌మెన్‌లపై చర్యలు తీసుకోవాలని 10 రోజుల నుంచి దీక్షలు కొనసాగిస్తున్నా, మూడుసార్లు గ్రీవెన్‌సెల్‌లో కలెక్టర్‌కు, రెండుసార్లు జిల్లా ఎస్పీకి అర్జీలు ఇచ్చినా నేటికి ఎలాంటి చర్యలు లేకపోవటంపై ప్రజాసంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేసి మరోసారి కలెక్టర్, ఎస్పీలకు అర్జీలు అందజేశారు.

క్లాప్ మిత్రలకు వేతనాలు ఇవ్వాలంటూ ధర్నా

ఈపూరు(శావల్యాపురం): ఈపూరు గ్రామ పంచాయతీలో స్వచ్ఛ భారత్‌లో క్లాప్ మిత్రలు 15 మంది విధులు నిర్వహించుతున్నారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ ఏరియా కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఆర్భాటంగా క్లాప్‌మిత్రలపై సవితి తల్లి ప్రేమ చూపించటం వైద్య పరీక్షలు ఆర్భాటపు ప్రచారాలు మినహా వారి కుటుంబ పోషణపై శ్రద్ధ చూపటంలో విఫలమైందన్నారు.

ప్రకృతి వ్యవసాయ సాగుతో భూమికి మేలు



ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను పరిశీలిస్తున్న డీపీఎం అమలకుమారి

బెల్లంకొండ: ప్రకృతి వ్యవసాయ విధానంతో పంటలను సాగు చేస్తే భూమి ఆరోగ్యంగా ఉండడంతో పాటు రైతులకు అదనపు ఆదాయం వస్తుందని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ అమలకుమారి తెలిపారు. సోమవారం నాగిరెడ్డిపాలెంలో బయో రీసెర్చ్ సెంటర్లో ఉత్పత్తులను హైదరాబాద్ వాలంతరీ ఆర్గనైజర్ సంస్థ డైరెక్టర్ కె. విజయ గౌరీతో కలసి పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగవుతున్న రైతుల పొలాలను సందర్శించారు. అనంతరం ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీఎం అమలకుమారి మాట్లాడుతూ రైతులు సేంద్రియ వ్యవసాయ విధానాన్ని పాటించాలని, రసాయనాలకు దూరంగా ఉండాలని తెలిపారు. వాలంతరీ ఆర్గనైజర్ ఏవో అన్నపూర్ణ, ఎంటీఎల్ పవన్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

సంఘ సంస్కర్త గురజాడ అప్పారావు



శాలివాహననగర్‌లో గురజాడ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఐద్వా జిల్లా కార్యదర్శి రజని

సత్తెనపల్లి: సమాజంలో కన్యాశుల్కాన్ని రూపుమాపిన గొప్ప సంఘ సంస్కర్త గురజాడ అప్పారావు అని ఐద్వా పల్నాడు జిల్లా కార్యదర్శి జి.రజిని కొనియాడారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని శాలివాహననగర్‌లో సోమవారం గురజాడ జయంతి సభ జరిగింది. సభకు సీఐటీయూ నాయకుడు ఎం.హరిపోతురాజు అధ్యక్షత వహించారు. ముందుగా ఐద్వా ఉపాధ్యక్షురాలు విమల గురుజాడ అప్పారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రజని మాట్లాడుతూ గురజాడ మహిళలను చైతన్యవంతులను చేసి ఉద్యమించారన్నారు. కన్యాశుల్కానికి వ్యతిరేకంగా ఆనాడు గురజాడ ఉద్యమించి ఆ దురాచారాన్ని రూపుమాపారన్నారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యురాలు డి.అమూల్య మాట్లాడుతూ కేంద్రంలో ప్రధాని మోదీ, రాష్ట్రంలో డెప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సనాతన ధర్మాన్ని పరిరక్షిస్తామని ప్రగల్భాలు పలుకుతున్నారన్నారు. అంటే ఆనాడు సంఘ సంస్కర్తలు రూపుమాపిన దురాచారాలను మళ్లీ ఈ రోజు సమాజంపై రుద్దడమేనని విమర్శించారు. సభలో 5వ పట్టణ కార్యదర్శి కె.సుధారాణి,కమిటీ సభ్యులు ఎం.రమాకుమారి, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ బృందం భేటీ

బొల్లాపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సామాజిక తనిఖీ బృందం సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఆర్‌పి, బి.ఆవులయ్య మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం, పంచాయతీరాజ్, సామాజిక భద్రత పింఛన్లు పై సోషల్ ఆడిట్ ఉంటుందని,17 వ విడత సామాజిక తనిఖీ బృందాలు నేటి నుంచి గ్రామాల్లో జరిగిన పనులను తనిఖీలు చేపడతామని తెలిపారు. వీటితోపాటు సామాజిక భద్రత పింఛన్లు తనిఖీ ఉంటుందని ఎస్ ఆర్ పి చెప్పారు.

కార్మిక వ్యతిరేక జీఓలను వెనక్కి తీసుకోండి

నరసరావుపేట: కూటమి ప్రభుత్వ ఎనిమిది గంటలు పని విధానాన్ని పది గంటలకు మార్చటం, రాత్రి వేళల్లో మహిళల చేత పనిచేయించాలనే జీవోలను రద్దు చేయాలని పలు కార్మిక సంఘ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పల్నాడు జిల్లా కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సోమవారం ఆర్టీసీ బస్టాండ్ వద్దనున్న మార్కెట్‌యార్డు ఎదుట ఎసీఐటీయూ నరసరావుపేట మండల కార్యదర్శి సిలార్ మసూద్ అధ్యక్షతన నిరసన కార్యక్రమం చేపట్టారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఆదాయ వనరులపై దృష్టి పెట్టండి

క్రోసూరు: పంచాయతీలు ఆదాయ వనరులపై దృష్టి పెట్టాలని ఇన్‌చార్జి ఎంపీడీవో జి.శ్రీనివాస్ తెలిపారు. పంచాయతీల్లో ఆదాయ వనరులు ఎలా పెంచుకోవాలో అంశాలపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమం సోమవారం క్రోసూరు మండలపరిషత్ అభివృద్ధి కార్యాలయంలో జరిగింది. ఇన్‌చార్జి ఎంపీడీవో జి.శ్రీనివాస్ అధ్యక్షత వహించగా రిసోర్సు పర్సన్లుగా పంచాయతీ కార్యదర్శులు పీసపాడు పీఎస్ ఉమామహేశ్వరరావు, 88త్యాళ్లూరు పీఎస్ శిరీష, క్రోసూరు 2 పీఎస్ కోటేశ్వరరావులు వ్యవహరించారు. శిక్షకులు మాట్లాడుతూ పంచాయతీల్లో ఆదాయ వనరులు ఏవిధంగా పెంపొందించాలి, పన్నుల వసూళ్లు, ఇంటి పన్ను, వృత్తిపన్ను, ఆస్తుల బదిలీ పన్నుల్లో వాటా, భూమి శిస్తులో వాటా, దుకాణాలపై పన్ను, జంతువులపై పన్ను, ప్రకటనలపై పన్ను, విశ్రాంతి భవనాలు, ఖాళీస్థలాలు, మార్కెట్లపై వ చ్చే అదాయ వనరులపై తప్పని సరిగా దృష్టి పెట్టాలన్నారు. ప్రజల నుంచి విరాళాలు, ట్రస్టుల ద్వారా విరాళాలు సేకరించుకోవచ్చనన్నారు. స్థిరాస్తి అభివృద్ధికి రుణాలు తీసుకుని ఆదాయం పొందవచ్చునన్నారు. ఉపాధి ఏపీవో వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మందుబాబుల అడ్డాగా పాఠశాల



పిడుగురాళ్ల ఎంపీపీ పాఠశాలలో జాతీయ నేతల విగ్రహాల వద్ద తాగి పడేసిన మద్యం సీసాలు



ప్రహరీ లేని జమున స్కూల్

పిడుగురాళ్ల: సెలవు రోజుల్లో మందుబాబులకు ప్రభుత్వ పాఠశాల అడ్డగా మారిపోతుంది. పట్టణంలోనే రైల్వే స్టేషన్ రోడ్‌లో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల (జమున స్కూల్)కు ప్రహరీ లేకపోవడంతో మందుబాబులకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. ఆదివారం సెలవుదినం కావడంతో రాత్రంతా పూటుగా మద్యం తాగిన కొందరు ఖాళీ సీసాలను పాఠశాల ప్రాంగణంలో, జాతీయ నేతల విగ్రహాల వద్ద పడేసి వెళ్లారు. సోమవారం ఉదయం చూసిన స్థానికులు అవాక్కయ్యారు. చిన్నారులు విద్యాభ్యాసం చేసే పవిత్రమైన పాఠశాలలో మద్యం సేవించడం ఏంటంటూ ప్రశ్నిస్తున్నారు. ఇటువంటి కార్యక్రమాలకు పాల్పడుతున్న వారిపై అధికారులు కఠినమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఇప్పుడే ఇలా ఉంటే దసరా సెలవుల పది రోజులు ఇంకెంత ఘోరంగా మారుతుందోనని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలకు తక్షణమే ప్రహరీ నిర్మించాలని డిమాండ్ చేస్తున్నారు.

న్యాయవాదుల నిరసన



పిడుగురాళ్ల కోర్టు వద్ద నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

పిడుగురాళ్ల: మృతిచెందినవారికి సంతాపం తెలిపే వేళల విషయంలో రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం విడుదల చేసిన సర్క్యులర్ నెంబరు 10/2025ను వ్యతిరేకిస్తూ గుంటూరు జిల్లా బార్ ఫెడరేషన్ పిలుపు మేరకు పిడుగురాళ్ల బార్ అసోసియేషన్ న్యాయవాదులు సోమవారం విధులు బహిష్కరించి, కోర్టు ఎదుట తమ నిరసన తెలిపారు. బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కె.కుమారస్వామి మాట్లాడుతూ సర్క్యులర్ రద్దు చేసేవరకు నిరసన కార్యక్రమాలు కొనసాగుతాయని తెలిపారు. బార్ అసోసియేషన్ సభ్యులు దార చెన్నయ్య, సెక్రటరీ కె.వెంకటేశ్వర్లు, బి.దాస్, కె.కోటేశ్వరరావు, మెరుగుమల్ల శ్రీనివాసరావు, ప్రశాంత నాయక్, వెలిసెల రామకృష్ణ, ఎస్వీ కోటేశ్వరరావు, అయాజ్ అహమ్మద్, అచ్చారావు, మందా జాకబ్, ఎం.శ్రీనివాసరావు, పల్లవి, పి.నవ్య, పి.మాణిక్యం, లోకేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఆ ముగ్గురి నుంచి నా ఆస్తి కాపాడండి

కలెక్టర్‌కు విన్నవించిన బాధితుడు



కలెక్టర్ కార్యాలయం వద్దకు వచ్చిన పోకూరి సూర్యనారాయణ దంపతులు

నరసరావుపేట: తాను కొనుగోలుచేసి రిజిష్టర్ చేయించుకున్న 50సెంట్ల భూమిని కాజేయాలని చూస్తున్న మాచర్లకు చెందిన నాగూర్‌వలి, కిజర్, సుభానీలపై చర్యలు తీసుకోవాలని బాధితుడు పోకూరి సూర్యనారాయణ కోరారు. ఈ మేరకు సోమవారం పీజీఆర్‌ఎస్‌లో కలెక్టర్‌ను కలిసి విన్నవించారు. బాధితుడు తెలిపిన వివరాల మేరకు తాను 1982లో మాచర్ల సిద్దయ్య వద్ద ఒక ఎకరా భూమిని కొనుగోలుచేసి రిజిష్టర్ చేయించుకున్నానని, అందులోని 45సెంట్ల భూమిని వేర్వేరు వ్యక్తులకు విక్రయించానని, తూర్పువైపున ఐదుసెంట్ల భూమిని దారి నిమిత్తం వదిలానని అన్నారు. మాచర్లలో చేతివృత్తి పని చేసుకుంటూ పిల్లల చదువుల నిమిత్తం గుంటూరులో నివాసం ఉంటుండగా, మిగిలిన 45సెంట్ల భూమికి దొంగ అగ్రిమెంట్లు సృష్టించి రెవెన్యూ రికార్డుల్లో వారిపేర్లు నమోదుచేసుకొని పట్టాదారు పాసుపుస్తకాలు కూడా పొందారన్నారు. దీని విషయంపై ఈ ఏడాది ఏప్రిల్‌లో పీజీఆర్‌ఎస్‌లో కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చానన్నారు. అయితే రెవెన్యూ అధికారులు తనకు ద్రోహం చేశారన్నారు. తన స్థలం గుండా నేషనల్ హైవే వెళుతుండగా నష్టపరిహారం కూడా కాజేయాలనే ప్రయత్నం చేశారని, దీనిని తాను రాష్ట్ర హైకోర్టు ఆశ్రయించి నిలుపుదల చేయించానన్నారు. తన పేరును రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేయాలని కోరుతూ మే 30వ తేదీన పీజీఆర్ఎస్‌లో కలెక్టర్‌ను కోరినా ఫలితంలేదని అన్నారు. అప్పటి మాచర్ల తహసీల్దార్ వారితో చేతులు కలిపి తప్పుడు సమాచారం రాష్ట్ర హైకోర్టుకు ఇచ్చారన్నారు. తనకు 84ఏళ్ల వయస్సులో ఉన్నందున తాను తిరగలేకపోతున్నానని, ఇప్పటికే తనను తుదముట్టిస్తామని చేసిన బెదిరింపులపై తాను జిల్లా ఎస్పీకి ఈనెల 15న ఫిర్యాదు చేయటం జరిగిందన్నారు. ఇప్పటికైనా రికార్డులను పరిశీలించి భూమిని కొలిపించి హద్దులు నిర్ణయించి, పేరును ఆన్‌లైన్‌లో చేర్చి వారి బెదిరింపుల నుంచి రక్షణ కల్పించాలని సూర్యనారాయణ కోరారు.

వివరాలు చెప్పమంటే స్పందించడం లేదు!



ఫిర్యాదు చేసేందుకు వచ్చిన ప్రజాసంఘాల నాయకులు

నరసరావుపేట రూరల్: సమాచార హక్కు చట్టం ద్వారా జొన్నలగడ్డ పంచాయతీ పన్నుల వివరాలు తెలపాలని దరఖాస్తు చేసినా స్పందించకపోవడంపై ప్రజా సంఘాల నాయకులు ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఫిర్యాదు చేశారు. మండలంలోని జొన్నలగడ్డ పంచాయతీ పరిధిలో విద్యాసంస్థలు, వ్యాపార సంస్థలతో పాటు ఇంటి పన్నుల వివరాలు తెలిపాలని 40 రోజుల క్రితం పంచాయతీ కార్యదర్శికి దరఖాస్తు చేసినట్టు ఫిర్యాదులో తెలిపారు. తాము చేసిన దరఖాస్తుకు ఇప్పటి వరకు పంచాయతీ కార్యదర్శి నుంచి ఎటువంటి సమాచారం అందలేదన్నారు. పంచాయతీకి ఆదాయం ఉన్నా గ్రామంలో కనీసం వీధి దీపాలు కూడా డబ్బులు లేవని పంచాయతీ కార్యదర్శి చెప్పడం హస్యాస్పదంగా ఉందని తెలిపారు. పంచాయతీ పరిధిలో పన్నులు, అభివృద్ధి వివరాలు చెప్పకుండా సమాచార హక్కు చట్టాన్నినీరుగార్చేందుకు ప్రయత్నిస్తున్న సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పీడీఎం నాయకులు నల్లపాటి రామారావు, వై.వెంకటేశ్వరరావు, బీసీ నాయకులు బాదుగున్నల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

నూజెండ్ల: వరద నీరు ముంచెత్తి ఇబ్బందుల పడుతున్న కమ్మవారిపాలెం యానాదికాలనీని మండల అధికారులు పరిశీలించారు. ఎంపిడివొ పి. ఉమాదేవి పొక్లయినర్ సాయంతో కాలువ తీయించి వరద నీటిని మళ్లించే ఏర్పాటు చేయించారు. ఆరోగ్యశాఖ వారు అంటువ్యాధులు ప్రబలకుండా మురుగు కాల్వల్లో బ్లీచింగ్ చల్లించి వైద్యశిబిరం ఏర్పాటు చేసి మందులు పంపిణీ చేశారు. కాలనీ వాసులకు తహసీల్దార్ రమేష్‌కుమార్ కాలనీలోని షుమారు 50 కుటుంబాలకు గాను ఒక్కొ క్క కుటుంబానికి 5 కెజిల బియ్యం, కందిపప్పు, స్థానిక ఎంఎల్ఎ జి.వి.ఆంజనేయులు అందజేసిన దుప్పట్లు, కూరగాయలు నిత్యావసర సరుకులు అందజేశారు.ప్రభుత్వం తరుపున అన్ని సంక్షేమ పథకాలు అందేలా చూస్తామని తహసీల్దార్ తెలిపారు. ఆధార్ లేని వారి కోసం ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేసి ప్రతి ఒక్కరికీ కార్డులు అందజేస్తామన్నారు. గ్రామ నాయకులు గంగినేని బాబు మాట్లాడుతూ స్థానిక ఎంఎల్ఎ సహకారంతో ప్రభుత్వం తరుపున అర్హులైన ప్రతి ఒక్క కుటుంబానికి నివేశన స్థలాలు మంజూరు చేయించటంతో పాటు పక్కా గృహాల నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. ఎంపీడీవో సూచించిన విధంగా కాలనీలోనికి వాగు నీరు రాకుండా త్వరలో కల్వర్టు నిర్మాణం చేపడతామన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ సైదా, వీఆర్ఒ నాసర్ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.